
శనార్తి

# తెలంగాణ

telanganarajyadhikaraparty.in

సంపుటి : 05 | సంచిక : 253 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | మంగళవారం 28-04-2026 | పేజీలు : 2


# పెట్రోల్ లిమిట్

## చుక్క చుక్కకూ కటకట

**తెలంగాణలో ఇంధన సెగ**

**బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు**

**కొరత కృత్రిమమా? వాస్తవమా?**

**డబ్బులు కట్టినా రాని స్టాక్**

**నిల్వలు ఉన్నాయంటున్న సర్కార్**

- మూతపడుతున్న బంకులు
- క్యూ కట్టిన వాహనాలు..
- ఖాళీ అవుతున్న ట్యాంకులు
- రాష్ట్రవ్యాప్తంగా డీజిల్ గందరగోళం
- డబ్బాలతో క్యూ కట్టిన రైతన్నలు
- హైదరాబాద్‌లోనూ పెట్రోల్ తిప్పలు
- సరిహద్దు జిల్లాల్లో సంక్షోభం
- మూడు రోజులుగా రాని ట్యాంకర్లు
- బైక్‌కు రూ.200.. కారుకు రూ.వెయ్యి
- అత్యవసరాలకూ తప్పని తిప్పలు
- నిలిచిపోయిన రవాణా వ్యవస్థ
- ప్రభుత్వానికి, బంకులకు మధ్య వార్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :**

ట్యాంక్ ఫుల్ చేయించుకునే స్తోమత లేక.. లీటరు పోయించుకుంటే గమ్యం చేరుతామో లేదో తెలియక.. బంకుల ముందు గంటల తరబడి పడిగాపులు కాస్తున్న సామాన్యుడికి ఇప్పుడు చుక్క చమురు దొరకడమే ఒక యుద్ధంలా మారింది. ఆఫీసులకు ఆలస్యమై బాసులు ఇచ్చే మెమోలు ఒకవైపు.. జీవితంలో భాగంగా మారిన బండి పెట్రోల్ కోసం తిప్పలు మరోవైపు.. ఇలా నగర జీవి నుంచి పల్లెటూరి రైతు వరకు ప్రతి ఒక్కరి దైనందిన జీవితం ఇప్పుడు నో స్టాక్ బోర్డుల మధ్య చిక్కుకుపోయింది. రూపాయి రూపాయి కూడబెట్టి ద్విచక్ర వాహనం కొనుక్కుంటే.. తీరా అవసరానికి రూ. 200 లకంటే ఎక్కువ పెట్రోల్ పోయమంటూ బంకు యజమానులు పెడుతున్న నిబంధనలు సగటు వాహనదారుడి ఆవేదనను రెట్టింపు చేస్తున్నాయి. ప్రభుత్వం ఏమో నిల్వలు ఉన్నాయంటుంది.. బంకులేమో నో స్టాక్ బోర్డులు వేలాడదీస్తున్నాయి.. ఈ రెండింటి మధ్య సామాన్యుడి కాలం, ఓపిక, జేబు ఖాళీ అవుతున్నాయి. మరోవైపు అది ఎండైనా.. వానైనా నగరాన్ని పరిగెత్తించే ఆటో చక్రాలు ఆగిపోయాయి. ఆర్డర్ వస్తే నిమిషాల్లో భోజనం అందించే డెలివరీ బాయ్స్ బైక్‌లు బంకుల ముందు నిర్జీవంగా నిలబడ్డాయి. గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల పాలిట 'నో స్టాక్' బోర్డు కేవలం ఒక సమాచారం కాదు.. అది వారి ఆకలి కేక. రోజువారీ సంపాదనతోనే ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు కట్టుకునే ఈ శ్రమజీవులకు, బంకుల వద్ద విధిస్తున్న రూ. 200 పెట్రోల్ పరిమితి ఒక శాపంలా మారింది. వచ్చిన కొద్దిపాటి పెట్రోల్‌తో గమ్యం చేరలేక.. కొత్త ఆర్డర్లు తీసుకోలేక.. తరువాయి 2లో...

# బీఆర్ఎస్ రీబిల్డ్..!

## సైలెంట్ వెనుక స్ట్రాటజీ..!




- రెండున్నరేళ్ల తర్వాత యాక్టివ్..!
- ప్లీనరీతో మళ్లీ ఫాంలోకి కేసీఆర్..!
- బీఆర్ఎస్‌కు కొత్త ఊపుపై నజర్..!
- క్షేత్రస్థాయి బలోపేతంపై దృష్టి..!
- ప్రతీ సెగ్మెంట్‌కు 200 మంది
- క్రియాశీలక కార్యకర్తల ఎంపిక..!
- రాష్ట్ర కమిటీ మినహా ఇతర కమిటీల రద్దు..!?
- పార్టీలో యువ రక్తానికి చోటు..!
- గ్రామ, మండల, జిల్లాల వారీగా కొత్తవారికి ఛాన్స్..!
- విద్యార్థి విభాగం మరింత యాక్టివ్..!
- ప్రతీ కాలేజ్‌కి బీఆర్ఎస్‌వీ కమిటీలు..!
- కీలక అసెంబ్లీ సెగ్మెంట్లలో సభలు..!
- కాంగ్రెస్‌ను ఉక్కిరిబిక్కిరి చేయడమే టార్గెట్..!
- మళ్లీ బీఆర్ఎస్‌ను పవర్‌లోకి తేవడమే
- లక్ష్యంగా పావులు కదుపుతున్న కేసీఆర్..!

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రక్షాళన మొదలైంది. భారాస రీబిల్డ్ జరగనుంది. ఆ దిశగా కేసీఆర్ కీలక నిర్ణయమే తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2023 తర్వాత కేసీఆర్ దాదాపు రెండున్నరేళ్ల పాటు మర్కూక్ ఎర్రవల్లి ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారు. ఒకటి రెండుసార్లు బాహ్య ప్రపంచంలోకి వచ్చినప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో మాత్రం యాక్టివ్‌గా పాల్గొనలేదు. బీఆర్ఎస్ కేడర్‌కూ ఎలాంటి దిశా, నిర్దేశం చేయలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పలుమార్లు మీడియా సమావేశాలు నిర్వహించేవారు. అవసరాన్ని బట్టి రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట అడపా దడపా బీఆర్ఎస్ బహిరంగ సభలుండేవి. అయితే గత రెండున్నరేళ్లుగా ఇవేవీ కనిపించలేదు. తెలంగాణలో అనేక కీలక సమస్యలను తరువాయి 2లో...

# రాష్ట్రంలో చిల్లర సర్కార్



## ధాన్యం కొంటందుకు చేతకాట్లే..

- రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెల్వట్లే
- బొందల పడ్డట్టు అయ్యింది
- బీజేపీ ఎంపీ తేజస్వీ పెద్ద వెధవ
- అలా మాట్లాడుతుంటే ఒక్కరూ అడ్డుపడలే
- బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే రణరంగం సృష్టించేటోళ్లు
- తెలంగాణ పట్ల బీఆర్ఎస్‌కే చిత్తశుద్ధి
- జైతెలంగాణ అనిపించేందుకే.. చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్నాం..
- మాజీ సీఎం కేసీఆర్

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో చిల్లర సర్కార్ నడుస్తోందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబురాల ముగింపు వేడుకల్లో కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సర్కారు పరిస్థితి చూస్తే.. రాష్ట్రం బొందలో పడ్డట్టు అయ్యిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనిపించిందని, తరువాయి 2లో...



# డేంజర్ జోన్‌లో తెలంగాణ

## ఉడికిపోతున్న ఆదిలాబాద్

## 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

2

**47 డిగ్రీలకు చేరే ఛాన్స్**

**ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్**

**రానున్న 48 గంటలు అత్యంత కీలకం**

తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తోంది. ఉదయం 9 గంటల నుంచే అడుగు బయటపెట్టాలంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. భానుడి ప్రతాపానికి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతుండటంతో జనం విలవిలలాడుతున్నారు. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై ఈ సీజన్‌లోనే అత్యంత వేడి రోజుగా రికార్డు సృష్టించింది. రాబోయే రెండు రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోందని, ఉష్ణోగ్రతలు ఏకంగా 47 డిగ్రీల మార్కును తాకే ప్రమాదం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

## ఒళ్లు దగ్గర పెట్టుకోండి..!

- మా పైప్ లైన్ల జోలికొస్తే ఊరుకోం..!
- మాది ఒక్క పైప్ లైన్ పేలితే
- యూఎస్ మిత్ర దేశాలవి నాలుగు పేల్చేస్తాం
- అమెరికాకు ఇరాన్ మాస్ వార్నింగ్



2

## ఢిల్లీ ఎక్సైజ్ కేసులో కేజ్రీవాల్ కొత్త పేచీ..!

- జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకు నిరాకరణ
- స్వర్ణకాంతకు లేఖ రాసిన కేజ్రీవాల్
- జడ్జిపై తనకు విశ్వాసం లేదని ఆరోపణ
- గాంధీ సత్యాగ్రహ మార్గంలో దీక్ష చేస్తానని వెల్లడి
- అవసరమైతే సుప్రీంకు వెళ్తానన్న కేజ్రీవాల్

2



# జనసంఘ్‌కు బెంగాల్ పుట్టినిల్లు

- మమతకు 15 ఏళ్లు ఛాన్స్ ఇచ్చారు
- మహిళల భద్రత కోసం దీదీ చేసిందేమీ లేదు
- యువత, రైతులను మమత అస్సలు పట్టించుకోలే
- బూతులు తిట్టడం, అబద్ధాలు చెప్పడమే టీఎంసీ విధానం
- బీహార్, ఒడిశాలో కమలం వికసించింది
- బెంగాల్‌లోనూ జెండా పాతుతాం : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

2

## కొత్త పార్టీతో ఒరిగేదేమీ లేదు



- రాష్ట్రంలో ఎన్నో పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి
- పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- కవిత పార్టీపై కేటీఆర్ విమర్శలు
- రాజకీయాల్లో ఆవేశం కాదు ఆలోచన ముఖ్యం
- ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం చేస్తాం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

# పెట్రోల్ లిమిట్

**మొదటిపేజీ తరువాయి...**

చేతిలో పని ఉన్నా కదలలేని స్థితిలో వారు అల్లాడుతున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడితే వచ్చే ఆ కాస్త ఇంధనం.. ఆ రోజు సంపాదనను కబళిస్తుంటే.. ప్రభుత్వ లెక్కల్లో ఉన్న నిల్వలు మా ట్యాంకుల్లోకి ఎప్పుడు వస్తాయంటూ ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చక్రం తిరిగితేనే పొయ్యి వెలిగే ఈ బతుకులు.. ఇప్పుడు ఇంధన కొరత సెగలో మాడిపోతున్నాయి.

### నిల్వలున్నాయంటున్న సర్కార్.. మూతపడుతున్న బంకులు

పౌరసరఫరాల శాఖ అధికారులు రాష్ట్రంలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని పదేపదే ప్రకటిస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ వంటి రద్దీ ప్రాంతాలతో పాటు సూర్యాపేట, ఖమ్మం, జోగులాంబ గద్వాల, మెదక్ జిల్లాల్లో మెజారిటీ బంకులు నో స్టాక్ బోర్డులు వేలాడదీశాయి. ప్రభుత్వానికి, బంకు యజమానులకు మధ్య జరుగుతున్న ఈ మాటల యుద్ధంలో సామాన్యుడు బలి పశువు అవుతున్నాడు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నిల్వలను అందరికీ పంపిణీ చేయాలనే నెపంతో బంకు నిర్వాహకులు రేషనింగ్ పద్ధతిని అమలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలకు: రూ. 200 మించి పోయడం లేదు. కార్లకు గరిష్టంగా రూ. వెయ్యి పరిమితి విధించారు. ఇదే సమయంలో బాటిళ్లు, డబ్బాల్లో ఇంధనం నింపడాన్ని పూర్తిగా నిలిపివేశారు. దీనివల్ల డబ్బాలతో క్యూ కట్టిన రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో ఉన్న ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, పంపుసెట్లకు డీజిల్ తీసుకెళ్లే మార్గం లేక వ్యవసాయ పనులు నిలిచిపోయాయి.

### కొరత కృత్రిమమా? వాస్తవమా?

కొన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు డీడీల రూపంలో రూ. 25 లక్షల వరకు ముందస్తుగా చెల్లించినా.. మూడు రోజులుగా ట్యాంకర్లు రావడం లేదని వాపోతున్నారు. ఆయిల్ కంపెనీల డిపోల వద్ద లోడింగ్ ప్రక్రియ మందగించడం వల్ల ఈ సరిహద్దు జిల్లాల్లో సంక్షోభం తలెత్తింది. పెట్రోల్ ధరల పెంపు సూచనలు ఉండడం.. కమిషన్ల విషయంలో ఆయిల్ కంపెనీలతో ఉన్న విభేదాల వల్ల డీలర్లు కావాలనే నిల్వలను దాచిపెడుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సోషల్ మీడియాలో వస్తున్న పుకార్ల వల్ల వాహనదారులు ఒక్కసారిగా బంకుల వద్దకు చేరుకోవడంతో పరిస్థితి మరింత జటిలమైంది.

సాధారణం కంటే మూడు రెట్లు ఎక్కువ డిమాండ్ పెరగడంతో ఉన్న నిల్వలు గంటల్లోనే హరించుకుపోతున్నాయి. దీనివల్ల అత్యవసరాలకూ తప్పని తిప్పలు ఎదురవుతున్నాయి. అంబులెన్స్‌లు, స్కూల్ బస్సులు, నిత్యావసర సరుకుల రవాణా వాహనాలు కూడా బంకుల ముందు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణవ్యాప్తంగా డీజిల్ గందరగోళం వల్ల నిలిచిపోయిన రవాణా వ్యవస్థ ధరల పెరుగుదలకు దారితీసే ప్రమాదం ఉంది. తూప్రాన్, మానవపాడు వంటి ప్రాంతాల్లో బంకులు వారంలో సగం రోజులే తెరుచుకుంటుండటంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దెబ్బ పడుతోంది.

### వరికోతలపై మస్తు ఎఫెక్ట్..

ప్రస్తుతం వరి కోతల సీజన్ కావడంతో హార్వెస్టర్ల కోసం వందల లీటర్ల డీజిల్ అవసరం ఉంటుంది. డీజిల్ దొరకకపోవడంతో పొలాల్లోనే కోతలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. ఏపీ నుంచి వచ్చే వాహనదారులు ముందస్తు జాగ్రత్తగా కోదాడ, సూర్యాపేట, చౌటుప్పల్ ప్రాంతాల్లో ట్యాంకులు ఫుల్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతానికి డీజిల్ కొరత ఎక్కువగా ఉందని, పెట్రోల్ కొంతవరకు అందుబాటులో ఉన్నప్పటికీ, ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే రెండు మూడు రోజుల్లో పెట్రోల్ కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందని బంకు నిర్వాహకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించే కోదాడ, మిర్యాలగూడ, నాగార్జున సాగర్ రూట్లలో వాహనాల రద్దీ అసాధారణంగా పెరిగింది. ఏపీ– హైదరాబాద్‌కు కీలకంగా ఉండే జాతీయ రహదారి 65 ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదు నుంచే వెళుతుండడంతో ఏపీకి చెందిన వాహనాలు ఇక్కడే పెట్రోల్, డీజిల్ పోయించేందుకు బారులుదీరారు. ఏపీలో ధరల వ్యత్యాసం, సరఫరాలో ఇబ్బందుల వల్ల అక్కడి వాహనదారులు తెలంగాణ సరిహద్దు బంకుల్లో ట్యాంకులు ఫుల్ చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల స్థానిక అవసరాలకు కేటాయించిన కోటా క్షణాల్లో హారతి కర్పూరంలా కరిగిపోతోంది.

### ఆయా జిల్లాల్లో ఇదీ పరిస్థితి..

చమురు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని పౌరసరఫరాలశాఖ చెబుతున్నప్పటికీ పలుచోట్ల పెట్రోల్ బంకుల్లో మాత్రం 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో డీజిల్, పెట్రోల్ కొరతతో పలు బంకులను తాత్కాలికంగా మూసివేశారు. ఖమ్మం నగరంతో పాటు అశ్వారావుపేట మండలం వినాయకపురం బంకు వద్ద.. కల్లూరు, మణుగూరు, సత్తుపల్లిలో పెట్రోల్ కోసం వాహనదారులు బారులుతీరారు. వేంసూరు ఐఓసీ బంకు దగ్గర అయితే పెద్దపెద్ద డబ్బాల్ని వరుసలో పెట్టారు. హైదరాబాద్‌లో హిమాయత్‌నగర్ సహా కొన్నిచోట్ల బంకుల్లో నో స్టాక్ బోర్డు పెట్టారు. మిగతాచోట్ల పరిస్థితి సాధారణంగానే ఉంది. సూర్యాపేట జిల్లాలో పదిహేనుకుపైగా పెట్రోల్ బంకులను తాత్కాలికంగా మూసివేసి నో స్టాక్ బోర్డు పెట్టారు. మిగతావాటిలో ఎక్కువ బంకుల్లో పెట్రోల్ ఉంటే డీజిల్ లేదు. డీజిల్ ఉంటే పెట్రోల్ లేదు. మద్దిరాలలోని ఓ బంకులో మూడ్రోజుల నుంచి పెట్రోల్, డీజిల్ లేవు. కోదాడ పట్టణంలోని ఓ బంకు నిర్వాహకుడు రెండు ట్యాంకర్ల కోసం ఆయిల్ సంస్థకు సుమారు రూ.25 లక్షలు మూడ్రోజుల క్రితం చెల్లించారు. ఆదివారం నాటికీ ఇంధనం రాకపోవడంతో బంకును మూసేయాల్సిన పరిస్థితి నెలకొంది. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో నాలుగు బంకులు ఉన్నాయి. డీజిల్, పెట్రోల్ కొరతతో వారంలో నాలుగురోజులే తెరిచి ఉంటున్నాయి. ఇప్పుడు ప్రధాన బంకు సహా రెండు తాత్కాలికంగా మూసి ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడులోని ఐవోసీ బంకులో శుక్రవారం సాయంత్రానికే స్టాకు అయిపోయింది. మళ్లీ సోమవారం స్టాకు వస్తుందని సిబ్బంది తెలిపారు.

### ధరలు పెరిగే ఛాన్స్ ఉండడంతో బ్లాక్ చేస్తున్నారా..?

బంకు నిర్వాహకులు లక్షలాది రూపాయలు ముందుగా చెల్లించినా ఆయిల్ కంపెనీల నుంచి ట్యాంకర్లు సకాలంలో రాకపోవడం వెనుక పెద్ద మిస్టరీయే దాగి ఉంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను పెంచడంలో ఆయిల్ కంపెనీలు విఫలమవుతున్నట్లు స్పష్టమవుతోంది. ధరలు పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలతో ఎక్కడైనా స్టాక్ హోల్డింగ్ జరుగుతుందా? అన్న అనుమానాలు లేకపోలేదు.ప్రస్తుతానికి డీజిల్ కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ, ఇదే పరిస్థితి కొనసాగితే మరో 48 గంటల్లో పెట్రోల్ నిల్వలు కూడా నిండుకునే అవకాశం ఉంది. అదే జరిగితే నిత్యావసర వస్తువుల రవాణా నిలిచిపోయి ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖ వెంటనే స్పందించి ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకోవాలి. సరిహద్దు బంకులకు అదనపు కోటాను కేటాయించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ డీజిల్ అందేలా చూడాలి. లేనిపక్షంలో ఈ ఇంధన సెగ సామాజిక సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంది.

## కొత్త పార్టీతో ఒరిగేదేమీ లేదు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన కవిత కొత్త పార్టీ పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పార్టీలు వస్తుంటాయని, పోతుంటాయని, వాటిని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. రాజకీయాల్లో ఆవేశం పనికి రాదని.. ఆవేశం కంటే ఆలోచన ముఖ్యమని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేటీఆర్ వివరించారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయడంలో భాగంగా స్టేట్ కమిటీ మినహా బూత్ కమిటీల నుంచి జిల్లా కమిటీల వరకు అన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే నిఖార్సైన కార్యకర్తలతో కొత్త కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. 420 హామీలు ఇచ్చి అమాయక ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఆయుధంగా మలుచుకుంటామని అన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ తప్పిదాలపై ప్రజల తరఫున పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటించి స్థానిక సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. అవగాహన లేకుండా.. పార్టీలు పెట్టడం రాజకీయంగా పనికి రాదని అన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి వస్తుందని.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని అన్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల తరఫున నిలబడడమే బిఆర్ఎస్ పార్టీ నైజం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## స్టాక్ మార్కెట్ల లాభాల బాట

- బీఎస్ఈ, ఎన్ఎస్ఈ దూకుడు
- సెన్సెక్స్ 639 పాయింట్స్
- నిఫ్టీకి 194 పాయింట్ల ప్రాఫిట్
- దేశీయ మార్కెట్లను ప్రభావితం చేసిన అంతర్జాతీయ పరిణామాలు

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** గత కొద్ది రోజులుగా నష్టాలు చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ లాభాల బాట పట్టాయి. బీఎస్ఈ, ఎస్ఎస్ఈ సోమవారం తమ దూకుడును ప్రదర్శించాయి. సెన్సెక్స్ 639 పాయింట్లు ఎగిసి 77,303 వద్ద ముగియగా, నిఫ్టీ 194 పాయింట్లు పెరిగి 24,092 మార్క్‌ను దాటింది. మూడు రోజుల నష్టాల తర్వాత మార్కెట్లు బలంగా కోలుకోవడం ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలు, ముఖ్యంగా గల్ఫ్‌లో పరిస్థితులు కాస్తా సానుకూలంగా ఉండడంతో మార్కెట్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. రిలయన్స్, సన్ ఫార్మా, ఐటీ షేర్లలో భారీ కొనుగోళ్లు సూచీలను లాభపడ్డాయి. దీంతో ఆయా కంపెనీల్లో లిస్ట్ అయిన మదుపర్లు సోమవారం స్టాక్ మార్కెట్లు లాభాల బాట పట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు..!

- అప్రమత్తమైన భద్రతా సిబ్బంది
- బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో విస్తృతంగా తనిఖీలు
- ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని అధికారుల వెల్లడి
- ఫేక్ మెయిల్ అని నిర్ధారణ

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** ఇటీవల న్యాయస్థానాలకు తరుచు బాంబు బెదిరింపులు రావడం ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా.. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రెండో టెర్మినల్‌కు సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు టెర్మినల్ అంతటా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో ప్రతి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఇది ఫేక్ ఈ –మెయిల్ అని నిర్ధారించారు. ఇది ఫేక్ ఈ –మెయిల్ అని తేలడంతో విమానాశ్రయంలో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. మెయిల్ సోర్స్, ఐపీ అడ్రస్ తదితర వివరాలను ట్రాక్ చేసే పనిలో పడ్డారు. తనిఖీల సమయంలో కాసేపు విమానాశ్రయంలో భద్రతా జాగ్రత్తలు చేపట్టినప్పటికీ, సాధారణ విమాన సేవలకు పెద్ద అంతరాయం కలగలేదని అధికారులు వెల్లడించారు.

## డేంజర్ జోన్‌లో తెలంగాణ

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తోంది. ఉదయం 9 గంటల నుంచే అడుగు బయటపెట్టాలంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. భానుడి ప్రతాపానికి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతుండటంతో జనం విలవిలలాడుతున్నారు. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై ఈ సీజన్‌లోనే అత్యంత వేడి రోజుగా రికార్డు సృష్టించింది. రాబోయే రెండు రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోందని, ఉష్ణోగ్రతలు ఏకంగా 47 డిగ్రీల మార్కును తాకే ప్రమాదం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అసాధారణంగా పెరుగుతున్న ఈ వేడిని పరిగణనలోకి తీసుకున్న వాతావరణ శాఖ రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ప్రధానంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కొమరంభీమ్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. ఈ జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలకు కూడా ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున బయటకు రావొద్దని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఒకవైపు ఎండలు మండిపోతున్నప్పటికీ స్థానికంగా ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఈ వర్షాలు వేడి నుంచి కొంత ఉపశమనం కలిగిస్తాయని ప్రజలు ఆశించినప్పటికీ, రాబోయే 48 గంటలు మాత్రం రాష్ట్రానికి అత్యంత కీలకం కానున్నాయి.

## ఒళ్లు దగ్గర పెట్టుకోండి..!



**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** అమెరికా ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని ఇరాన్ హెచ్చరించింది. యూఎస్ తమ దేశ గ్యాస్ పైపు లైన్లు, చమురు బావులను ధ్వంసం చేయాలని చూస్తోందని, అదే గనుక జరిగితే అమెరికా మిత్రదేశాలను తాము అస్సలు వదలబోమని స్పష్టం చేసింది. అమెరికా సేనలు తమ దేశానికి సంబంధించిన ఒక్క గ్యాస్ పైపు లైన్‌ను పేల్చితే, తాము ఆ దేశానికి చెందిన నాలుగు పైపు లైన్లను పేల్చేస్తామని వార్నింగ్ ఇచ్చింది. తమ దేశానికి చెందిన ఒక చమురు బావిని ముట్టుకున్నా..గల్ఫ్‌లో ఏ దేశ చమురు బావుల నుంచి ఉత్పత్తి జరగనివ్వబోమంది. ఈ విషయంలో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పిచ్చి ప్రేలాపనలను మానుకోవాలని హితవు పలికింది. లేకపోతే మున్ముందు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని వెల్లడించింది.

## హైదరాబాద్‌ను కమ్మేసిన మబ్బులు..!

- నగరంలోనే పలు చోట్ల కురిసిన వర్షం నిలిచిపోయిన వాహనాల రాకపోకలు
- భాగ్యనగరంతో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసే చాన్స్..!
- హెచ్చరించిన వాతావరణ శాఖ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని అలెర్ట్ జారీ





**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న హైదరాబాద్ నగర వాసులకు ప్రకృతి ఊరటనిచ్చింది. సోమవారం సాయంత్రం వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. నగరంలోని పలు ప్రాంతాలను నల్లటి మబ్బులు కమ్మేయడంతో పట్టపగలే చీకటి అలుముకుంది. 40 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఎండ తీవ్రత వల్ల ఏర్పడిన వేడి నేపథ్యంలో మేఘాలు ఒక్కసారిగా నగరాన్ని చుట్టుముట్టాయి. దీంతో సాయంత్రం 5 గంటలకే నగరం మొత్తం చీకటిమయమై, గంభీరమైన వాతావరణం ఏర్పడింది. వాతావరణ మార్పుల కారణంగా.. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్ దేవ్ పల్లి, బండ్లగూడ జాగీర్, హిమాయత్ సాగర్, కిస్మత్ పూర్ ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. సైబరాబాద్ పరిధిలోని నార్సింగి, కోకాపేట్, మణికొండ, పుప్పాలగూడ, నెక్కంపూర్ ప్రాంతాల్లో కూడా తేలికపాటి వర్షం కురిసింది. వర్షం కారణంగా వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.

హైదరాబాద్ తో పాటు సిటీని ఆనుకొని ఉన్న మేడ్చల్ మల్కాజ్ గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మారిన వాతావరణ కారణంగా భాగ్యనగరంలో భారీ వర్షం కురిసే చాన్స్ ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అలెర్ట్ జారీ చేశారు. ఈ వర్ష సూచన తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉండటంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు జిల్లాలకు రెయిన్ అలెర్ట్ జారీ చేశారు.

## బీఆర్ఎస్ రీబిల్డ్..!

**మొదటిపేజీ తరువాయి...**

ఆయన అడ్రస్ చేసిన సందర్భాలు లేవు. ఈ వ్యవహారమే పార్టీ కేడర్‌ను కాస్తా నిరుత్సాహానికి గురి చేసింది. అయినప్పటికీ కేసీఆర్ స్ట్రాటజీనే వేరని పార్టీ వర్గాలు చెబుతుండేవి. కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన ఏడాది, రెండేళ్లకే ప్రజా పోరాటాలు చేస్తే పబ్లిక్ నుంచి పెద్దగా రెస్పాండ్ ఉండదనేది కేసీఆర్ లెక్క. అందుకే కేసీఆర్ ఈ రెండున్నరేళ్ల పాటు వ్యూహాత్మక మౌనం పాటించి ఉంటారని ఆ పార్టీ వర్గాల అంచనా.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించి రెండున్నరేళ్లు పూర్తి అయ్యింది. ఈ రెండున్నరేళ్లలో ఆయనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతే వచ్చింది. సరిగ్గా కేసీఆర్ కూడా ఇలాంటి సమయం కోసమే వేచి ఉన్నట్లు తెలుస్తోంది. వ్యతిరేకత ప్రజల నుంచి వచ్చిన తర్వాతే ప్రజా పోరాటాలు ఉద్యమాలు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయనేది కేసీఆర్ స్ట్రాటజీ. సరిగ్గా ఇదే సూత్రాన్ని ఇప్పుడు బీఆర్ఎస్ అధినేత ఫాలో అవుతుండడం గమనార్హం. ఇందుకోసం కేసీఆర్ వ్యూహాత్మకంగా పార్టీ ప్లీనరీని ఒక వేదికగా ఎంచుకున్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గంతో సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలోనే పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం గమనార్హం. టీఆర్ఎస్, ఆ తర్వాత బీఆర్ఎస్‌గా మారిన తర్వాత పార్టీలో భారీ ప్రక్షాళన జరగలేదు. ఈ విషయంలో క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి కేడర్ వరకు కొందరు కీలక నాయకుల్లో అసంతృప్తి రేపుతోంది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీలో కొందరు మాత్రమే కీలక పదవుల్లో ఉన్నారు. అనేక మందికి పార్టీ పరంగా పదవులు లేవు. వారంతా చాన్నాళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్నప్పటికీ బీఆర్ఎస్‌లో సముచిత స్థానం లేకుండా పోయింది. ఇలాంటి వారే మున్ముందు పార్టీ తరఫున చేపట్టబోయే కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉండకపోవచ్చని కేసీఆర్ అంచనా. అందువల్ల పార్టీలో కొత్త రక్తాన్ని ఎక్కించడం ద్వారా బీఆర్ఎస్‌లో కొత్త జోష్ నింపినట్లవుతుందని అధినేత భావిస్తున్నారు.

అందులో భాగంగానే ప్లీనరీ సందర్భంగా కేసీఆర్ ఒక రాష్ట్ర కమిటీని తప్ప ఇతర అన్ని కమిటీలను రద్దు చేసేశారు. ఆయా కమిటీల్లో కొత్త వారికి చోటు ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లా, మండల, గ్రామ కమిటీల్లో కొత్తవారికి చోటు ఇవ్వడం ద్వారా వారు మరింత ఉత్సాహంతో పని చేసేందుకు ఆస్కారముంటుందని భావిస్తున్నారు. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఎంతటి కీలక భూమిక పోషించిందో పెద్దగా చెప్పాల్సిన పనిలేదు. అనేక జిల్లాల్లో ఉద్యమం ఉధృతంగా సాగిందంటే అది టీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం పుణ్యమే. కానీ, 2023 తర్వాత ఆ లోటు స్పష్టంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్వీ గతంలో మాదిరి యాక్టివ్‌గా లేదనే అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా మళ్లీ పార్టీ విద్యార్థి విభాగాన్ని క్రియాశీలకం చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ కళాశాలలో బీఆర్ఎస్వీ కమిటీలు ఉండాలని కేసీఆర్ ఆదేశించారు. తద్వారా కాంగ్రెస్‌పై రాజీలేని పోరాటాలు చేయాలన్నదే కేసీఆర్ ఆలోచన. ఇక పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 200 మంది యాక్టివ్ నేతలను ఎంపిక చేసుకోవాలని కేసీఆర్ సూచించారు. వీరికి తెలంగాణ భవన్‌లో మూడు రోజుల పాటు శిక్షణనిచ్చి గ్రౌండ్ లెవెల్‌లో యాక్టివ్ చేయాలని నిర్ణయించారు. పార్టీ కార్యక్రమాలను వీరు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలరని కేసీఆర్ ఎక్స్‌ఫెక్ట్ చేస్తున్నారు. ఇక ఇలా బీఆర్ఎస్‌ను తొలుత క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర వరకు పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసిన తర్వాత కాంగ్రెస్‌ను ఉక్కిరిబిక్కిరి చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. ముందు పార్టీని కొత్త రక్తంతో నింపి ఆసక్తి కల్గిన వారిని గుర్తించి వారిని పార్టీ చేయబోయే ప్రజా ఉద్యమాల వైపు మళ్లించడం ద్వారా కాంగ్రెస్‌ను గట్టిగా టార్గెట్ చేయొచ్చని అంచనా వేస్తున్నారు. వెరసి రానున్న రెండేన్నరేళ్ల కాలంలో రేవంత్ పరిపాలనపై ప్రజల్లో మరింత వ్యతిరేకతను పెంచి తిరిగి బీఆర్ఎస్‌ను పవర్‌లోకి తేవాలనే వ్యూహంతో కేసీఆర్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

## జనసంఘ్‌కు బెంగాల్ పుట్టినిల్లు

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** బీజేపీ మాతృసంస్థ జనసంఘ్‌కు పశ్చిమ బెంగాల్ పుట్టినిల్లు అని, అలాంటి ఈ రాష్ట్రంలో ఇక్కడి ప్రజలు ఈసారి తప్పకుండా భాజపాకు అవకాశం ఇస్తారని తాము భావిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. బెంగాల్ అసెంబ్లీ రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా బ్యారక్‌పూర్‌లో సోమవారం బీజేపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ర్యాలీలో మోడీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బెంగాల్‌లో సుదీర్ఘ కాలంగా గుండాగిరి పాలన సాగుతోందని ఆరోపించారు. 15 ఏళ్ల పాటు ఇక్కడి ప్రజలు దీదీకి అవకాశమిచ్చినట్లు గుర్తు చేశారు. అయినప్పటికీ బెంగాల్‌ను మమత పెద్దగా అభివృద్ధి చేయలేకపోయారన్నారు. దీదీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దారుణంగా నష్టపోయారని, వారికి తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. బెదిరించడం, అబద్ధాలు చెప్పడం తృణమూల్‌కు అలవాటుగా మారిందన్నారు. టీఎంసీ నేతలకు సైన్యం, రాజ్యాంగ సంస్థలంటే అస్సలే గౌరవం లేదన్నారు. ఇలాంటి విధానాలు ప్రజాస్వామిక దేశంలో ఎంత మాత్రం సబబు కాదన్నారు. బెంగాల్‌లో మహిళలకు రక్షణ లేని పరిస్థితులున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కాచెల్లెళ్లకు భద్రత కల్పించడంలో మమతా సర్కార్ దారుణంగా వైఫల్యం చెందిందన్నారు. గత పదిహేనేళ్లుగా బెంగాల్ యువత, ప్రజల బాగోగుల గురించి దీదీ ఆలోచన చేయలేకపోయిందన్నారు. రాష్ట్రంలో యువతకు పని లేకుండాపోయిందని, వారు ఉపాధి కోసం పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రైతన్న వెన్నెముక వంటి వారని, అలాంటి అన్నదాతకు తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేకపో యిందని విమర్శించారు. బీహార్, ఒడిశా ప్రజలు బీజేపీని రెండు చేతుల దీవించారని, ఇప్పుడు బెంగాల్ ప్రజల ఆశీర్వాదం కోరుతున్నట్లు చెప్పారు. వెస్ట్ బెంగాల్‌లో ఈసారి కమలం వికసించడం ఖాయమన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే బెంగాల్‌లో శాంతి–భద్రతలకు పెద్దపీట వేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన మరింత సహకారాన్ని కూడా అందజేస్తామని స్పష్టం చేశారు.

## ఢిల్లీ ఎక్సైజ్ కేసులో కేజ్రీవాల్ కొత్త పేచీ..!

**శనార్తి తెలంగాణ, నేషనల్ డెస్క్:** ఢిల్లీ లిక్కర్ కేసులో ఆప్ చీఫ్, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కొత్త పేచీకి తెరలేపారు. జస్టిస్ స్వర్ణకాంత శర్మ ముందు విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరించారు. తనకు ఆమె వద్ద న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదన్నారు. అందుకే స్వర్ణకాంత శర్మ ముందు విచారణకు హాజరయ్యేందుకు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్ సోమవారం తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ...జస్టిస్ స్వర్ణకాంత శర్మకు లేఖ రాశారు. ఢిల్లీ ఉన్నత న్యాయస్థానంలో తనకు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో హైకోర్టులో తాను వ్యక్తిగతంగా కాని, తన న్యాయవాది ద్వారా కాని వాదనలు వినిపించబోమని స్పష్టం చేశారు. జస్టిస్ స్వర్ణకాంత శర్మ వద్ద ట్రయల్ నిష్పాక్షికంగా జరుగుతుందనే నమ్మకం కలుగడం లేదన్నారు. అందుకే జాతిపిత మహాత్మగాంధీ చూపించిన మార్గంలో న్యాయం కోసం ఢిల్లీలోనే గాంధీ విగ్రహం ముందు సత్యాగ్రహ దీక్ష చేయనున్నట్లు వెల్లడించారు. లిక్కర్ కేసులో స్వర్ణకాంత శర్మ ఎలాంటి తీర్పు ఇచ్చినా సుప్రీంకోర్టుకు వెళ్తానన్నారు. తనకు గాంధీ సిద్ధాంతాలపై పూర్తి విశ్వాసం ఉందని, ఆయన చూపించ మార్గంలోనే తనను తాను రక్షించుకునేందుకు సత్యగ్రహ దీక్ష రూపంలో పోరాటం చేయనున్నట్లు వివరించారు.

## రాష్ట్రంలో చిల్లర సర్కార్

**మొదటిపేజీ తరువాయి...**

బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పెద్ద వెధవ అని, అలా మాట్లాడుతుంటే ఒక్కరు కూడా అడ్డుపడలేదన్నారు. కాంగ్రెస్ వెధవలు ఒక్కరు కూడా మాట్లాడలేదని ఘాటు విమర్శలు చేశారు. అదే బీఆర్ఎస్ ఎంపీలు సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లమని పేర్కొన్నారు. తెలంగాణ హక్కుల కోసం గట్టిగా పోరాడేవాళ్లమని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల పట్ల బీఆర్ఎస్‌కు ఉన్న చిత్తశుద్ధి మరే పార్టీకి లేదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కేసీఆర్ తీవ్రంగా విమర్శించారు. పక్క రాష్ట్రాల ప్రజలు విగ్రహాన్ని చూడటానికి వస్తుంటే గేట్లు కూడా తీయకుండా అవమానించారని, తాము పోరాటం చేసిన తర్వాతే గేట్లు తెరుచుకున్నాయని ఆరోపించారు. ఇక రైతుల పరిస్థితిపై స్పందిస్తూ.. ధాన్యం కొనడం చేతకాక రైతులను గోస పెడుతున్నారని, రైతు బంధు వంటి గొప్ప పథకాలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో ఎన్నో సందర్భంలో నన్ను మానసిక క్షోభకు గురి చేశారని కేసీఆర్ అన్నారు. హైదరాబాద్ విషయంలో వెనక్కి తగ్గమని సోనియాగాంధీ 16 సార్లు చెప్పారని, హైదరాబాద్ విషయంలో రాజీ పడితే తెలంగాణ విషయం త్వరగా తేలుతుందని సోనియా గాంధీ నాతో చెప్పారన్నారు. కానీ నేను ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ కావాలని అప్పట్లో గట్టిగా కొట్లాడి సాధించామన్నారు. 2009లో చంద్రబాబుతో జై తెలంగాణ అనిపించేందుకే నాడు టీడీపీతో పొత్తు పెట్టుకున్నామన్నారు.